


# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

సోమవారం| 25 ఆగస్టు 2025

పేజీలు 8


ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిధి : జిల్లా పశ్చిమ ప్రాంతంలో అన్నదాతలకు ముందుగా కోతకు వచ్చె పంటనే ఉల్లి..లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంటను తీస్తే దిగుబడులు వెక్కరించినా పరవలేదు కాని ధరలు లాటరీ తగిలితే కష్టానికి తగ్గ పలితం వస్తుందని ఆశించడం రైతన్న వంతు కానీ పంటకు గిట్టుబాటు ధరలు అందక పంటనే విక్రయాలకు తరలించకుండా పంట పొలాల్లోనే వదిలేస్తున్నారు అంటే వారికి కనీసం పంటకోత కూలీలు కూడా దక్కడం లేదనేది స్పష్టంగా అర్థం అవుతుంది..ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో ఉల్లి పంటలు చేతికొచ్చాయి.. కాని వాటిని అమ్ముకునేందుకు కర్షకులు నానా అగుచాట్లు పడుతున్నారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉల్లిపంటను పండించారు.

మిగతా 2లో



ఉల్లి పంటతో రైతన్న (ఫైల్)



- పంట చేతికొచ్చినా అన్నదాతకు ఆనందమేది..!
- దిగుబడులు అందక..ధరలు లేక సతమతం
- పొలాల్లోనే వదిలేస్తున్న ఉల్లి పంట..
- ఇంటింటా తిరిగి అమ్ముకుంటున్న రైతులు

# ఉల్లి ధరల "లొల్లి"



## ఈ నెల 27 నుంచి

# గణేష్ ఉత్సవాలు ప్రారంభం

- వినాయక మండపాల్లో రెండు వేలకు పైగా కొలువుదీరనున్న గణనాథులు
- భక్తులతో "జమహెూ గణనాథ" అంటూ పూజలందుకోనున్న గణనాథులు

కర్నూల్ కల్చరల్ మేజర్ న్యూస్ : ప్రతిఏటా దేశ వ్యాప్తంగా జరుగుతున్న వినాయకుడి ఉత్సవాల కార్యక్రమాలు ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కర్నూలు నగరంలో దాదాపు రెండు వేల పైగా వినాయకుని విగ్రహాలు ఆయా మండపాల వద్ద కొలువుదీరనున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని మండపాల్లో వినాయకుని విగ్రహాలు ప్రతిష్టించడం జరిగింది. ఈనెల 27వ తేదీ నుంచి ఆయా మండపాల్లో కొలువుదీరిన వినాయకుడి విగ్రహాలకు పూజా కార్యక్రమాలు ఉత్సవాలు భక్తులు

మిగతా 2లో



## ఒక్క వజ్రమైనా దొరికేనా..!

# కష్టాలు తీరిపోయేనా..!



కాలువ వెంట వజ్రాలను వెతుకుతున్న ప్రజలు, వృద్ధులు

మహానంది, మేజర్‌న్యూస్ : రెక్కాడితే గాని డొక్కాడని పేదవాడికి చిన్న ఆశ. ఒక్క వజ్రమైనా దొరికేనా మా కష్టాలు తీరిపోయేనా అన్న కోణంలో మహానంది మండలంలో వజ్రాల వేట కొనసాగుతోంది. మహానంది మండల పరిధిలోని నంద్యాల–గిద్దలూరు రహదారిలో సర్వనరసింహ స్వామి ఆలయం సమీపంలోని వాగు వెంట ప్రజలు వజ్రాల వేటను కొనసాగిస్తున్నారు. వర్షం పడితే చాలు భువిలోని వజ్రం బయటికి వస్తాదనే కోణంతో వజ్రాల వేటను కొనసాగిస్తున్నారు. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నంద్యాల, కడప జిల్లాల నుంచి ప్రజలు ప్రతినిత్యం వందలాదిగా తరలి వస్తున్నారు. నల్లమల అడవి నుంచి వచ్చే వాగులో వజ్రాల అన్వేషణను జల్లడపట్టి వెతుకుతున్నారు. అత్యధికంగా ఈ వజ్రాల వేటలో వృద్ధులే

మిగతా 2లో

# మట్టి వినాయకుని విగ్రహాలనే పూజిద్దాం

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్

కర్నూలు కల్చరల్, మేజర్ న్యూస్ : మట్టి వినాయకుని విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ ప్రజలను కోరారు. కర్నూలు నగరంలోని వెంకటేష్ థియేటర్ ప్రక్కనున్న పాత గోశాల వద్ద గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వేముల రమేష్ ఉచితంగా మట్టి వినాయకుని విగ్రహాలు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీంతో పాటు పాతబస్టాండులో వాసవీ ఏజెన్సీస్ యజమాని శేషఫణి మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా

మిగతా 2లో



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ.భరత్

# శ్రీశైల మల్లన్న దంపతులకు వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకిలో కొలువుతీరిన శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులు

శ్రీశైలం,మేజర్ న్యూస్:

లోక కల్యాణం కోసం శ్రీశైల దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చక స్వాములు సేవా సంకల్పాన్ని పఠించి తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీస్వామి అమ్మ వార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపించి ఆ తరువాత పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు.

మిగతా 2లో

సూర్య

సోమవారం| 25 ఆగస్టు 2025

# ఈ నెల 27 నుంచి గణేష్ ఉత్సవాలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించనున్నారు. వినాయక మండపాలను ప్రత్యేకంగా విద్యుత్ కాంతులతో అలంకరించనున్నా రు. ఇప్పటికే దాదాపు అన్ని మండపాల వద్ద కమిటీ వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏడాది భాద్రపద మాసభలోని శుక్లపక్షం చతుర్థి తిధిని వినాయక చవితి పండుగగా హిందువులు జరుపు కుంటారు. ఈ భాద్రపద మాసాన్ని వినాయకుడి మాసంగాను శుభప్రదం మాసంగాను భావించి వినాయకుడిని పూజిస్తారు. విఘ్నలకు అధిపతిగా విగ్నేశ్వరుని కొలుస్తారు. జ్ఞానానికి, శ్రేయస్సుకు, అదృష్టానికి, ప్రతీకగా ప్రత్యేకగా ప్రతీకగా వినాయకుని పూజించడం భారతీయుల సంస్కృతి సాంప్రదాయం. శుభకార్యాలు,పూజలు,నూతన గృహప్రవేశాలు, భవనాలు, షాపింగ్ మాల్స్, నూతన కళాశాలలో పాఠశాలలు వైద్యశాలలు తదితర వంటి కొత్తగా ప్రారంభించే ఏ కార్యక్రమంలోనైనా ముందుగా వినాయకునికి పూజలు చేసి అనంతరం వాటిని ప్రారంభిస్తారు. భారత దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పండుగలలో వినాయక చవితి పండుగ ఎంతో శ్రేష్టమైనది కుల మతాలకు అతీతమైనది భక్తిశ్రద్ధలతో కూడుకున్నది అతి పెద్ద పండుగ. వినాయకుడు జన్మించిన రోజును వినాయక చతుర్థి లేదా వినాయక చవితి పండుగను జరుపుకోవటం ఆనవాయితీ.

**చరిత్ర :** ఒకరోజు పార్వతి తాను స్నానమాడే ముందు తన ఒంటికి రాసుకున్న పసుపు ముద్దతో ఒక బొమ్మను తయారు చేసే ఆ బొమ్మకు ప్రాణం పోసి తన కుమారునిగా చూసుకుంటుంది. బయట గుమ్మం దగ్గర తన కుమారుని కాపలాగా ఉంచి లోపలికి ఎవరి రానివ్వకూడదని కుమారునికి ఆదేశాలు ఇచ్చి పార్వతి స్నానానికి వెళుతుంది. అదే సమయంలో శివుడు గుమ్మం దాటి వెళ్లడానికి ప్రయత్నం చేయగా కుమారుడు అడ్డుపడతాడు. దీంతో ఆగ్రహంతో శివుడు ఆ బాలుని తలను నరికి వేస్తాడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతి తన బిడ్డను బతికించాలని పట్టుబడుతుంది. దాంతో పరమేశ్వరుడు బ్రహ్మ సహకారంతో ఏనుగు తలను తీసుకొచ్చి ఆ బాలుని శరీరం ఉండడానికి అతికించి జీవం పోస్తాడు. అప్పుడు ఆ బాలుడు ఏనుగు తల గల దేవతగా విలక్షణంగా మారిపోయి గణేశుడిగా అవతారమందుతాడు. అతని ప్రత్యేక రూపానికి దేవతలు ప్రజల యొక్కఅడ్డంకులు తొలగించే విగ్నేశ్వరుడిగా విజయాలు చేకూర్చే వినాయకుడిగా, శ్రేయస్సును కలిగించే గణనాధుడిగా సామర్థ్యానికి ప్రసిద్ధిగా దీవెనలు అందిస్తారు. ఆ విధంగా వినాయకుడు జననం ప్రారంభమైంది. అప్పటినుండి ప్రజలు భక్తులు గణేష్ చతుర్థి పండుగను గణేష్ పునర్జన్మను స్మరించుకొని గణేష్ ఉత్సవాలను జరుపుకుంటారు. గణేష్ని, గణనాయకాని, ఏకదంతుడని, వక్రతుండాని, వినాయకుడని, గౌరీ తనయుడని, బాలచంద్రుడని వంటి పేర్లతో ఆయన పిలుస్తారు.

**ప్రత్యేక పూజలు కార్యక్రమాలు :**

ముందుగా భక్తులు తలంటు స్నానం ఆచరించి గణేష్ విగ్రహాలను ప్రత్యేకమైన బంక మట్టితో,పసుపుముద్దలతో విగ్రహాన్ని తయారు చేస్తారు. ఈ విగ్రహాన్ని ఒక ప్రత్యేకమైన పీఠమీద ప్రతిష్టింపచేసి పూజలు నిర్వహిస్తారు. పూజలో ప్రత్యేకంగా అరటి ఆకు లు, జిల్లేడు ఆకులు పువ్వులు, తులసి దళాల ఆకులు, తమలపాకులు, చెరుకుగడలు,ఎలక్కాయలు, అరటి పండ్లు, టెంకాయలు, బంతిపూలు, మావిడాకులు మొదలుగు వంటి వాటితో అలంకరించి అలంకరిస్తారు. గణనాధునికిష్టమైన మోదక్,ఉండ్రాళ్ళు, కుడుములు, లడ్లు, సున్నుండలు, గారెలు, అరటి పండ్లు, కొబ్బరి కాయలు, ఎలక్కాయలు, గుమ్మడికాయలు పూజలో ఏర్పాటు చేస్తారు.ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన నైవేద్యంతో గణేష్నికి అభిషేకాలు నిర్వహిస్తారు. ప్రత్యేకంగా రోజువారిగా కుంకుమహారతి, దీపం హారతి, మహా హారతి ఒంటికి కార్యక్రమాలతో ఘననాధునికి పూజలు చేస్తారు. ఈ పూజా కార్యక్రమాలు మన కర్నూలు జిల్లాలో ఆయా ప్రాంతాలను బట్టి మూడు రోజులు, ఐదు రోజులు, ఏడు రోజులు, తొమ్మిది రోజుల పాటు గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆయా మడ్డపల వద్ద అనేక రూపాలలో పలు రకాల అలంకారాలలో వినాయకుని అలంకరిస్తారు.గణనాధునికిరోజుకొకనైవేద్యంతో పూజా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. వినాయక చవితి ప్రారంభం మొదటి రోజున రాత్రి వేళలో చంద్రుని చూడకూడదనే ఆచారం ఉంది. ఆరోజు రాత్రి చంద్రుని చూస్తే అపశకునమని నీలాపనిందలు కలుగుతాయని భక్తులు భావిస్తారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు :**

నగరంలో ఏర్పాటు చేసిన ఆయా గణేష్ మండపాల వద్ద కమిటీ వారి ఆధ్వర్యంలో ప్రతిరోజు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పా టు చేయడం జరుగుతుంది. ముఖ్యంగా భజనలు, శ్లోకాలు,శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, కోలా టాలు, చెక్కభజనలు, బుర్రకథలు, హరికథలు, పావురానిక, సాంఘిక నాటకాలు, సినీ సంగీత,విభావరి కార్యక్రమాలు, భక్తి గీతాల సంగీత కార్యక్రమాలు, సాంప్రదాయబద్ధమైన పోటీలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఇలా రోజుకు ఒక కార్యక్రమాలు ఆయా మండపాల వద్ద ఎంతో కోలాహాలంగా గణేశు ఉత్సవాలను నిర్వహిస్తారు.

**నిమజ్జన కార్యక్రమం :**

సెప్టెంబర్ 4వ తేదీన నగరంలోని అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వినాయక ఘాట్ల వద్దగణేష్ విగ్రహాలు నిమజ్జన చేయడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోఅన్ని ఏర్పాట్లు చేయడానికి సంసిద్ధమయ్యా. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆయా మండపాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో మండపాల వద్ద ఎలాంటి సంఘటనలుజరగకుండా ఉండేలా మండపాల కమిటీ పెద్దలు జాగ్రత్తలు వహించాలని అలాగే రాత్రి వేళలో మండపాల వద్ద పడుకోవడానికి కమిటీ వారు రోజువారిగా కొందరిని ఏర్పాటు చేయాలని మండపాల భద్రత పైన మండపం కమిటీ పెద్దలు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలోడ్రోన్ కెమెరాలతో ఆయా ప్రదేశాల్లో ప్రత్యేక పర్యవేక్షణ నిఘాలు ఏర్పాటు చేయబోతున్నామని ఆయన తెలిపారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎవరైనా ఉత్సవాలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎస్ పి హెచ్చరించారు.

# ఉల్లి ధరల "లొల్లి"

(మొదటి పేజీ తరువాయి)

కానీ ఈ ఏడాది పంటలు దిగుబడి పెరిగినా ధరలు వెక్కిరిస్తున్నాయి అని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి 70 వేల రూపాయలు ఖర్చు అవుతున్నాయి. పంట 150 సంచులు అంటే దాపు 75 క్వింటాళ్లు దిగుబడులు వస్తే కనీసం సగం పెట్టుబడులు కూడా చేతికి రాకున్నాయని అన్నదాతలు ఆవేదన చెందుదున్నారు. ప్రస్తుత ధరలు చూస్తే ఎకరానాకా 70 వేల రూపాయలు పెట్టుబడి అయితే 30 వేల రూపాయలు కూడా చేతికి అందకుండా పోతున్నాయని వాపోతున్నారు. ఇలా అయితే ఉల్లి రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు. మార్కెట్ ధరలు 300 రూపాయల నుండి 600 రూపాయలకు క్వింటం ధరలకు కొంటే ఎలా గిట్టుబాటు అవుతుందని కనీసం ఉల్లి కోసిన కూలీలకు వేతనం సరిపోదని పంటపొలాల్లోనే పంటను వదివేసే పరిస్థితులు నెలకున్నా యి. ఎన్నికల వేళ మాత్రమే గిట్టుబాటు ధరలు కల్పిస్తాం అంటున్న పాలకులు అధికారంలోకి వచ్చాక ఉల్లి, మిరిప రైతులను విస్మరించడం జరుగుతుందన్నారు. జిల్లా, రాదాని కేంద్రాలకు ఈ దారి వెంట వెల్లె నాయ కులకు రైతుల కస్టాలు తెలియవా.. కనీసం వారు వాహనాలు ఆపి అయినా రైతులకు ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆరోపిస్తున్నారు.

## శ్రీశైల మల్లన్న దంపతులకు వైభవంగా పల్లకీ ఉత్సవం

**మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ :** శ్రీశైల మల్లన్న సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు వేకువజామున నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ స్వామి అమ్మవార్ల దర్శనార్థమే ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు.దీంతో ఉచిత,శీఘ్ర,అతి శీఘ్ర క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది.

**భక్తులను అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన :** ధర్మపథంలో భాగంగా శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరిస్తున్నాయి. ధర్మపథంలో భాగంగా ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళారాధన వేదిక వద్ద దేవస్థానం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ప్రతిరోజు కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ,సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం,భక్తిరంజని లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



# ఒక్క వజ్రమైనా దొరికేనా..! కష్టాలు తీరిపోయేనా..!

(మొదటి పేజీ తరువాయి)

కనిపిస్తున్నారు. వజ్రం దొరకడం దేవుడికెరుక కాని చిరు వ్యాపారుల పంట మాత్రం పండు తుంది. ఆంజనేయపురం, గాజులపల్లి గ్రామాల్లో కొందరు ఇళ్లను అద్దెకు తీసుకుని ప్రతిని త్యం ఈ వజ్రాల వేటను కొనసాగిస్తున్నారు. గత 10 సంవత్సరాలుగా ఈ వేట కొనసాగి స్తున్నా సరైన వజ్రం నాకు దొరికింది అని చెప్పే నాదుడే లేదు. ఆ ఊరి వాళ్లకు దొరికింది ఈ ఊరి వాళ్లకు దొరికిందని చెప్పుకుంటున్నారే తప్ప నాకు ఈ వజ్రం దొరికింది అని చెప్పే నాదుడే లేదు. ఊహాగానాలతో ప్రబలిన ఈ ప్రచారంతో పలు జిల్లాల నుంచి వందలాదిగా ప్రజలు తరలివచ్చి ఈ అన్వేషణను కొనసాగిస్తున్నారు. అడవి జంతువులు ఎక్కడ దాడి చేస్తాయో అని కొందరు భయభ్రాంతులకు గురవుతున్నారు.

## 29న కర్నూలుకు రానున్న రాష్ట్ర మంత్రులు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పులకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధుల వినతులను స్వీకరించేందుకు ఈ నెల 29న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు కర్నూలుకు వస్తున్నట్లు కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో 29న ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు నగరంలోని సునయన ఆడిటోరియంలో జరుగనుంది. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సంబంధిత వినతులను మంత్రులకు అందచేయాలని విజ్ఞప్తి చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వారందరికి ఈ సమావేశం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## నేరప్రవృత్తిని వీడండి..




**ప్యాపిలి, మేజర్ న్యూస్ః** సమాజంలో నేరప్రవృత్తిని వీడి తోటివారితో సంతోషంగా, కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని జలదుర్గం ఎస్సై నాగార్జున అన్నారు. ఆదివారం రౌడీషీటర్లకు స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, ఘర్షణలు, వ్యక్తిగత కక్ష్యలతో జీవితాలను నాశనం చేసుకోకూడదని, ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించి జీవితాలను జైలుపాలు చేసుకోవడం మంచిదికాదని, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవడం సరైనది కాదన్నారు. కేవలం కుటుంబం కోసం అహర్నిషలు కష్టపడి భార్యపిల్లలతో సంతోషంగా జీవించాలని, నేరప్రవృత్తిని వీడాలని రౌడీషీటర్లకు ఎస్సై నాగార్జున సూచించారు.

# మట్టి వినాయకుని విగ్రహాలనే పూజిద్దాం

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి టి.జి భరత్ పాల్గొని ప్రజలకు విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కర్నూల్లోవినాయకచవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు. ప్రజలందరూ మట్టి విగ్రహాలు పూజిస్తే పర్యావరణానికి హాని కలగకుండా ఉంటుందన్నారు. తమ టీజీవీ సంస్థల తరఫున కర్నూలు నగరంలో మట్టి వినాయకుని విగ్రహాలే పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కుల, మతాలకు అతీతంగా కర్నూల్లో అన్ని పండుగలు ప్రజలందరూ సంతోషంగా జరుపుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

## దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి పూజలు

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుంద మండలం దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి ఆదివారం భక్తులు విశేషంగా పూజలు చేశారు.స్వామి వారికి అర్చకులు ఉదయాన్నే రుద్రాభిషేకం, పుష్పార్చాన ,బిల్వార్చాన ,మహామంగళారతి,అమ్మవారికి కుంకుమ,బండారుఅర్చన పూజలను చేశారు.భక్తులు మండలం నుండి కాకుండా కర్ణాటక ప్రాంతాల నుండి అధిక సంఖ్యలోహాజరైయ్యారు.దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది.అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు.కమిటి సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా
- జిల్లా వ్యాప్తంగా కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహణ
- **70 మోటర్ సైకిళ్లు, 50 మద్యం బాటిళ్లు, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం**



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా హెచ్చరించారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 10 పోలీసు స్టేషన్‌ల పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అందులో 70 మోటర్ సైకిళ్లు, 50 మద్యం బాటిళ్లు, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు ప్రతి ప్రాంతంలో ప్రజల మధ్య ఫ్రెండ్లీ పోలీసింగ్ పెంపొందించడం, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడం అందులో భాగమని అన్నారు. నంద్యాల సబ్ డివిజన్ బండిఆత్మకూరు పోలీసు స్టేషన్ పరిధిలోని ఏ.కోడూరు, గోస్పాడు పోలీసు స్టేషన్ పరిధిలోని పసురపాడు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ధృవపత్రాలు లేని 12 వాహనాలను అలాగే 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ రుద్రవరం పోలీసు స్టేషన్ పరిధిలో పెద్దకంబలూరు, కోవెలకుంట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని జగజ్జననీనగర్ గ్రామంలో సరైన ధృవపత్రాలు లేని 10 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డోన్ సబ్ డివిజన్ నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలో ఫ్యాక్షన్ గ్రామం మరియు డోన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో వెంకటనాయినిపల్లె, బేతంచెర్ల పోలీసు స్టేషన్ పరిధిలోని దుర్గా పేటలో సరైన ధృవపత్రాలు లేని 27 మోటర్ సైకిళ్లు అలాగే 17 క్వార్టర్ బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ కొట్టాల చెరువు, ఆత్మకూరు రూరల్ సర్కిల్ పాములపాడు పరిధిలోని ఎర్రగూడూరు, నందికొట్కూరు టౌన్ స్టేషన్ పరిధిలో చికారిపేటలో 21 మోటర్ సైకిళ్లు, 14 మద్యం సీసాలు, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనుమానితులు, రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. వారి వేలిముద్రలను మొబైల్ సిస్టమ్ చెక్ డివైజ్ ద్వారా పరిశీలించారు. ప్రస్తుత నేరాలపై, సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక చర్యలు, అసాంఘిక కార్యక్రమాలు, అనుమానస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని తెలిపారు.

# కాలనీవాసులు అప్రమత్తంగా ఉండండి

**– సిఐ హనుమంతు నాయక్**



ప్రజలతో మాట్లాడుతున్న సిఐ హనుమంతు నాయక్, ఎస్సైలు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలోని జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల సిఐ హనుమంతు నాయక్ కాలనీవాసులకు సూచించారు. ఆదివారం ఆ రెండు కాలనీలలో సంజామల ఎస్సై రమణయ్య, రేవనూరు ఎస్సై, కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డి, సిబ్బందితో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరి బయట ఉన్న కాలనీలలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు తమకు సమాచారం అందించాలని అన్నారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీ సుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహి ంచినా, పేకాట, జూదం వంటి వాటిని ప్రోత్స హించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. పలు విషయాలపై పోలీసులు కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. శక్తి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలకు ఏమైనా జరిగితే డయిల్ 112 గురించి అవగాహన కల్పించారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**– జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లాఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# 29న ఉమ్మడి జిల్లాల సరిహద్దుల మార్పుపై విజ్ఞప్తుల స్వీకరణ



**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల, గ్రామాల పేర్లు, అలాగే వాటి సరిహద్దులు మార్పు కోసం ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఈనెల 28న రాష్ట్ర మంత్రుల బృందం విజ్ఞప్తులను స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాకు సంబంధించి కర్నూలు సునయన ఆడిటోరియంలో 29న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నాం 12గంటల వరకు రాష్ట్ర నీటి వనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి అభ్యర్థనలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తారని చెప్పారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు చేసిన అభ్యర్థనలలో ఉత్పన్నమయ్యే సమస్యలు, సలహాలు, సూచనలను అధ్యయనం చేసి సమగ్రంగా పరిశీలించి జిల్లా, మండల, గ్రామాల పేర్లు, సరిహద్దుల మార్పు కోసం సహేతుకంగా వాటిని పరిష్కరించడానికి మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# ఎన్టీఆర్ విగ్రహం కృష్ణుడు రూపంలో వద్దు



రఘురాముడు యాదవ్

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో గానీ దేశంలో గానీ రాజకీయ నాయకుల విగ్రహాలకు శ్రీ కృష్ణుడు రూపం పెట్టవద్దని అలా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు రఘురాముడు యాదవ్, నాగేశ్వర్ రావు యాదవ్, శ్రీనివాసులు యాదవ్, రాఘవేంద్ర యాదవ్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా పక్కెల్లపాడు గ్రామంలో శ్రీ కృష్ణుడు రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని దొంగచాటుగా ఆవిష్కరించారని అన్నారు. విగ్రహ ఆవిష్కరణ వాయిదా వేశామని యాదవ నాయకులకు హామీ ఇచ్చి ఇచ్చిన హామీకి విరుద్ధం మాత్రమే కాకుండా మతపరమైన విశ్వాసాలకు భంగం కల్గించే చర్యను గ్రామస్తులు చేశారు. హిందూ సమాజం ఆరాధించే శ్రీ కృష్ణుడు రూపంలో మానవ విగ్రహాన్ని ప్రతిష్టించడం అపరాధం. భక్తి పేరుతో మత భావాలను దెబ్బతీయడం సామాజికంగా హానికరం, చట్టపరంగా శిక్షార్హం అన్నారు. వెంటనే విగ్రహాన్ని తొలగించి నిర్వాహకులకు తెలిపారు. ఇకపై మానవులను దేవతా రూపంలో ప్రతిష్టించే ప్రయత్నం చేయరాదని అన్నారు.

# గుడిసె దగ్ధం .. రూ.3లక్షలు ఆస్తి నష్టం



**బండి ఆత్మకూరు రూరల్ ,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన బండి ఆత్మకూరులో ఆదివారం ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో దర్గా మరియమ్మ అనే మహిళకు చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు .గుడిసెలోని ఇంటి సామాను వంట సామాన్లతో పాటు బీరువాలోని రెండున్నర తులాల బంగారు 50 వేల రూపాయల నగదు కూడా పూర్తిగా కాలిపోయాయని బాధితురాలు మరియమ్మ తెలిపింది. గుడిసెలోని సామానంత పూర్తిగా కాలిపోవడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వం తమను వెంటనే ఆదుకొని ఆర్థిక సాయం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు. విఆర్‌ఓ నాగార్జున ప్రమాదవశాత్తు జరిగిన ఘటన విచారించి నివేదికను తహసీల్దారు అందజేస్తున్నట్లు తెలిపారు.

# ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు





**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని గాజులపలి ఆర్ఎస్ గ్రామానికి చెందిన గిరిజనుడు నరసింహుడు అనే వ్యక్తి ఎలుగుబంటి దాడిలో గాయపడ్డాడని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆదివారం చలమ రేంజ్‌లోని సున్నంబట్టి ఏరియాలో ఆ వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసిందని గ్రామస్తులు తెలిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన నరసింహులును నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# విశ్వ బంధుత్వ దినోత్సవం




రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** ఓంశాంతి విశ్వ బం ధుత్వ దినోత్సవం పురస్కరిం చుకుని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎన్‌జిఓ కాలనీలోని ఓం శాంతి మంది రం ఆవరణంలో ఏర్పాటు చేశారు. రాజయోగిని ప్రకాశ మని దాదిగారి పుణ్య స్మృతి సందర్భంగా జరిపే విశ్వబంధు త్వ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, పర్యవేక్షించగా ఓం శాంతి ప్రతినిధులు సావిత్రి, హరిప్రియ మాతాజీలతో పాటు సతీష్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, విజయ్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దస్తగిరి, నాగేశ్వరరావు, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 40మందికి పైగా ఓంశాంతి ప్రతినిధులు రక్తదానం చేయగా వీరికి సర్టిఫికెట్లు అందజేశారు.

# పింఛన్ పోయిందన్న మనోవేదనతో ఆనారోగ్యం పాలు



మద్దిలేటికి సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్న దృశ్యం



దివ్యాంగుడు బోయ బొగ్గు చిన్న మద్దిలేటి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ప్రతి నెల వచ్చే వికలాంగల పింఛన్ తీసివేస్తున్నట్లు అధికారులు నోటీసులు ఇవ్వడంతో మనోవేధనకు గురై భోజనం సకాలంలో తినకపోవడంతో వ్యక్తి ఆనారోగ్యం పాలైన మంచం పట్టిన సంఘటన మండల కేంద్రమైన గోనెగండ్లలో చోటు చేసుకుంది. గోనెగండ్లలోని దొనబండ వీధికి చెందిన బోయ బొగ్గ చిన్న మద్దిలేటికి పుట్టుకతోనే మూగ, చెవుడు, కొంత మతిస్థిమితం కూడా సరిగా లే దు.మద్దిలేటికి గత కొన్నేళ్లుగా వికలాంగుల పింఛన్ వస్తుంది. అయితే వారం రోజుల క్రి తం నీకు 40 శాతం కంటే వికలాంగత్వం తక్కువగా ఉంది కావున నీకు పింఛన్ తొలగి స్తున్నట్లు అధికారులు నోటీసుఇచ్చారు. దీంతో మద్దిలేటి మనోవేధనకు గురయ్యాడు. భోజ నం సకాలంలో చేయకపోవడంతో ఆరోగ్యం క్షీణించింది. నడవలేని పరస్థితికి చేరు కున్నా డు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక వైద్యులచే చికిత్స చేయిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు విచారణ చేసి తగు న్యాయం చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# మహిళ బంగారు గొలుసు చోరీ

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలోని సాయిబాబా మందిరం నుంచి గుంజలపాడు రోడ్డుకు వాకింగ్‌కు వెళ్తున్న కోవెలకుంట్లకు చెందిన లక్ష్మీకుమారి అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు చోరీకి గురైనట్లు ఎస్సై మల్లికార్జున రెడ్డి తెలిపారు. ప్రతి రోజు వాకింగ్‌లో భాగంగా శనివారం సాయంత్రం వాకింగ్ కోసం వెళ్తుండ గా గుర్తు తెలియని వ్యక్తి ఆమెను అనుసరించి మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును చోరీ చేసినట్లు బాధితురాలు కోవెలకుంట్ల ఎస్సై మల్లికార్జున రెడ్డికి ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ కావడంతో వాకింగ్‌కు వెళ్లే వారు భయాందోళనలకు గురవుతున్నారు.

# విద్యార్థులు భారతీయ సంస్కృతిని రక్షించే సమర్థులు కావాలి




మాట్లాడుతున్న రాష్ట్రీయ సేవిక సమితి ప్రాంత భౌద్ధిక్ ప్రముఖ్ లలిత

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు భారతీయ సంస్కృతి, వైభవాన్ని రక్షించే సమర్థులు కావాలని రాష్ట్రీయ సేవిక సమితి ప్రాంత భౌద్ధిక్ ప్రముఖ్ లలిత అన్నారు. శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి కర్నూలు సంస్కార భారతి వారి ఆధ్వర్యంలో ఆదివారం బి తాండ్రపాడు క్రెడో పాఠశాల నందు విద్యార్థులకు గణేష్ మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, మట్టి వినాయకుల తయారీ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 650మంది విద్యార్థులు పాల్గొని ఆయుర్వేద జీవన విధానం, ఉప నిషత్తులలో ఏవైనా రెండు సంవాదాలు, నారీ శక్తి, ఆపరేషన్ సింధూర్, భారతీయ సాంస్కృతిక వైభవం, స్వదేశీ మరియు స్వావలంబన్, విద్యార్థులకు పనికి వచ్చే ఏదైనా ఒక సుభాషితం, పంచతంత్రం కథలు, షోడస సంస్కారాలు, సాధన చతుష్టయం, యోగా వల్ల విద్యార్థులకు కలిగే లాభాలు, విజయం కోరుకునే విద్యార్థులకు ధ్రువ జ్ఞానం ఆవశ్యకత వంటి అంశాలపై పోటీలలో పాల్గొని సంస్కారాలు పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన లలిత మాట్లాడుతూ చిన్న చిన్న కథల ద్వారా విద్యార్థులలో సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్రీయ దృక్పథం, మహా పురుషుల జీవితాలు తెలియజేస్తూ పిల్లల్లో చిన్నతనం నుండి శుభ సంస్కారాలను మొలకెత్తించారు. విద్యార్థులు భారత భవిష్యత్తు, ప్రపంచ గౌరవం, తల్లిదండ్రులకు గర్వకారణము వారిలో సామర్థం అనే అనంత బాండగారం దాగి ఉంది దానిని వెలికి తీసే ప్రయత్నం చేశారు. ఉత్తమశీల నిర్మాణము భారతీయ సంస్కృతి, గొప్పదనాల గురించి పరిచయం చేశారు. అలాగే గణేష్ ఉత్సవ సమితి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ మోక్షేశ్వర్ విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు వివరించారు. జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతూ గణేష్ మహోత్సవాలలో భాగంగా మన సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ ఆదర్శంగా వినాయక చవితి సంబరాలు జరుపుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోరంట్ల రమణ, నగర అధ్యక్షులు రంగస్వామి, చింతలపల్లి రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమానుద్దేశించి పాఠశాల యాజమాన్యం శ్రావ్య, కార్తీక్‌లు పిల్లలను ఇలాంటి ఉత్తమ సంస్కారాలు నింపే కార్యక్రమం వారి పాఠశాల నందు జరిగినందుకు ఆనందాన్ని వ్యక్తపరిచారు.

# చేనేతల నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం తీర్చాలి

**– వర్షాలకు మగ్గాలు తడిసినా పట్టించుకోరా..?**

**– తక్షణమే రుణ సహాయం అందించి ఆదుకోవాలి.. బుట్టా**



చేనేతల నష్టాలను వింటున్న బుట్టా



సీమంత వేడుకల్లో బుట్టా

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్ ప్రతినిది :** ఇటీవల కురిసిన వానలకు చేనేతల ఇళ్లలోకి వర్షం నీరు చేరుకుని మగ్గాల తడిసి ముద్దఅయిన నేపద్యంలో చేనేతలు తీవ్రంగా నష్టపోవడం జరిగింది కావున ప్రభుత్వం తక్షణంగా ఆర్థికంగా నష్టపోయిన వారిని ఆదుకోవాలని కర్నూలు పార్లమెంట్ మాజీ సభ్యురాలు, ఎమ్మిగనూరు వైకాపా ఇంచార్జ్ బుట్టారేణుక పాలక కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె చేనేతల ఇళ్లను సందర్శించి వారికి వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని కనుగొన్నారు. వర్షాలకు తడిపోయిన జరీ మగ్గాలతో తీవ్రంగా నష్టం జరిగిందని చేనేతబిడ్డ బుట్టారేణుకకు చేనేతలు మొరపెట్టుకున్నారు. ఇలా వర్షాలతో నష్టపోయినా పాలకులు ఇక్కడకు వచ్చి మా కష్టాలను,నష్టాలను కూడా చూడలేదని వాపోయ్యారు. చేనేతలకు ఇచ్చిన మాట ప్రకారం 200 యూనిట్లు, 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించడమే కాకుండా 25 వేల రూపాయలు ఆర్థిక భరోసాని అందిచి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా ఉన్నా కూడా చేనేతలకు మాటిచ్చిన జగనన్న తన పాలనలో 24 వేల రూపాయలు చేనేతకు నేతన్ననేస్తం అందించడం జరిగిందన్నారు. అంతేకాక ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో వాలెంటియర్ వవ స్థద్వారా వివరాలు సేకరించి మగ్గాలతో నష్టపోయిన వారిని తోనంగా ఆదుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఆమె వెంట వైకాపా సీనియర్ నాయకులు బుట్టానీలకంతప్ప, మున్సిపల్ చైర్మన్ కెఎస్ రఘు, కౌన్సిలర్లు మీసాల నీలకంతప్ప, శివప్రసాద్, వైకాపా నాయకులు చేనేత మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబంకు పరమార్శ..** ఎమ్మిగనూరు మండల పరిదిలోని తిమ్మా పురంకు చెందిన వైకాపా నాయకులు బోయ పరమేష్ తల్లి లక్ష్మమ్మ ఇటీవల మరణించిన వార్త తెలుసుకున్న బుట్టా దంపతులు ఆదివారం తిమ్మాపురం గ్రామం చేరుకుని వైకాపా నాయకులు పరమేష్ కుటుంబాన్ని పరమార్శించారు. ఈకార్యక్రమంలో వైకాపా నాయకులు బోయ బజారి పాల్గొన్నారు.

**సీమంతం వేడుకల్లో బుట్టా..** ఎమ్మిగనూరు పట్టణవైకాపా ఉపాధ్యక్షులు బజారెడ్డి కూతురు సీమంతం వేడుకలకు ముందుగానే బుట్టా దంపతులు పాల్గొన్నారు. బజారెడ్డి కూతురు జ్యోతిని సారె అందిచి వారు ఆశీర్వదించారు.

# మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలి

**– మైనార్టీ సభను జయప్రదం చేయండి.. – కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు**



**ఆదోని రూరల్, మేజర్ న్యూస్ :** ముస్లీం మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఏదగాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు అమన్ పేర్కొన్నారు. ఆదివారం రాజశ్రీ ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 28న విజయవాడలో జరిగే మైనార్టీ సభను జయప్రదం చేయాలన్నారు. ముస్లీంలు మైనార్టీ విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేసి కూలీ పనులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం, ప్రజాస్వామ్య రక్షణ కోసం రాహుల్‌గాంధీ అనునిత్యం పోరాడుతున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమం కోసం వారితో కలుస్తున్నారన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం ఏకైక లక్ష్యంగా పెట్టుకొని ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలన్నారు. అనంతరం ఈనెల 28న జరిగే మైనార్టీ సభకు కర్నూలు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిమంది మైనార్టీ సోదరులంతా భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జీలు రమేష్ యాదవ్, కాశీంవలి, ఆదోని పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దీలిప్ డోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పట్టణ యువజన అధ్యక్షుడు వీరేష్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర నాయకులు శ్రీనిత్ రాయల్, మాజీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు నూర్ అహ్మద్, గుజిరి నూర్, ఫరూక్ అహ్మద్, నిస్సార్ అహ్మద్, సయ్యద్ ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల గోడౌన్‌లు తనిఖీ

**ఎస్సై మధుసూదన్**

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** పట్టణంలోని ఎరువు లు, ఫెస్టిసైడ్స్ దుకాణాలకు సంబంధించిన గోడౌన్‌లను ప్యాపిలి ఎస్సై మధుసూదన్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గోడౌన్‌లలో నిల్వ ఉంచిన ఎరువులు, మందులను పరిశీలించారు. అనంతరం షాపులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.



గోడౌన్‌లను తనిఖీ చేస్తున్న ఎస్సై మధుసూదన్

# మానవత్వం చాటుకుంటున్న మానవతా సేవా సంస్థ



అధ్యక్షుడు సివి రమణను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు ప్రసాద్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మానవ సేవే మాధవ సేవ అని మానవత్వాన్ని చాటుకుంటున్న మానవతా స్వచ్ఛంధ సేవా సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మానవత సేవా సంస్థ అధ్యక్షులు యుగంధర్ శెట్టి, నగర అధ్యక్షులు సివి రమణలు అన్నారు. నగరంలోని వెంకటరమణ కాలనీలోని ఎస్ఏపి క్యాంపు గేటు ఎదురుగా ఉన్న మానవతా సేవా సంస్థ కార్యాలయంలో నెల వారి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సివి రమణను అధ్యక్షులుగా ఎన్నుకుని సన్మానించారు. ఈ సందర్భంగా కన్వీనర్‌గా మనోహర్ రెడ్డి, కమిటీ సభ్యులు ప్రసాద్,శంకర్‌లు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు, ప్రస్తుత ఉద్యోగులు కలిసి మానవత స్వచ్ఛంధ సేవా సంస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. చనిపోయిన వారికి ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం ఉచితంగా అందచేయడం జరుగుతుందన్నారు. ఐడొనేషన్ కార్యక్రమం కూడా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తమ వద్ద రక్తదాతలు కూడా ఉన్నారని ఎవరికైనా అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైతే తమను సంప్రదించాలని వారు తెలిపారు. ఫ్రీజర్ బాక్స్, శాంతిరథం కావాల్సిన వారు 9440227756, 9866783999లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సాయి, హెడ్ కానిస్టేబుల్ భవాణి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారి విస్తరణ బాధితులకు టిడిఆర్ బాండ్లు పంపిణీ



బాండ్లను పంపిణీ చేస్తున్న కమీషనర్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగర పరిధిలో ఎన్‌హెచ్ 340సి జాతీయ రహదారి విస్తరణలో స్థలం కోల్పోయే బాధితులకు ట్రాన్స్‌ఫర బుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టిడిఆర్) బాండ్ల జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో స్థలం కోల్పోతున్న ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లను అందచేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య సర్కిల్ నుండి ఎస్‌సెస్ గార్డెన్స్ వరకు ఎన్‌హెచ్ 340సి జాతీయ రహదారిని 100అడుగులుగా వెడల్పు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మొత్తం 2.34కి.మీ పొడవున ఈ విస్తరణలో 201ఆస్తులు ప్రభావితమవగా, 178ఆస్తులు పూర్తి ప్రబావితం అవుతున్నాయన్నారు. ఈ క్రమంలో తొలుత భూములు కోల్పోయిన ముగ్గురు బాధితులకు టిడిఆర్ బాండ్లు అందచేశామన్నారు. త్వరలో మరో 40మందికి బాండ్లు అందిస్తామన్నారు. ఇప్పటికే 159మందికి నోటీసులు జారీ చేయగా 110మంది సమ్మతిపత్రాలు ఇచ్చారన్నారు. మిగిలిన ప్రజలు కూడా సహకరించి నగర అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఇటీవల ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జెసి డా.బి నవ్యలు రహదారిని సందర్శించారని గతంలో బాధితులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించినట్లు కమీషనర్ గుర్తు చేశారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైమ్ ప్లస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సంతాన సాఫల్య కౌన్సిలింగ్



వైద్య పరీక్షలు చేసిన డాక్టర్ అపురూప

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** కర్నూలు మండలం ఆర్ కొంతలపాడు గ్రామంలో కర్నూలు నగరానికి చెందిన ప్రైమ్ ప్లేస్ ఆసుపత్రి వైద్య బృందం, సంతాన సాఫల్య కౌన్సిలింగ్ గ్రామస్తులకు నిర్వహించారు. ఆదివారం కొంతలపాడులోని ఆశోక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో గ్రామానికి చెందిన ప్రజలకు ప్రైమ్ ప్లస్ మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ అపురూప గ్రామంలోని దంపతులకు సంతాన సాఫల్యం పొందడానికి కౌన్సిలింగ్ నిర్వహించారు. సంతానానికి భార్యభర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఆహార అలవాట్లు మార్చుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జెంక్ ఫుడ్‌లకు దూరంగా ఉంటూ పౌష్టికాహారమైన ఆకుకూరులు, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని తెలిపారు. మద్యపానం, ధూమపానం ఇతర వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. వైద్య శిబిరంలో భార్యభర్తలకు రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రైమ్ ప్లేస్ వైద్య బృందం, సిబ్బంది, కొంతల పాడు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులను వేధిస్తున్న యూరియా కొరత..

- ఎరువుల దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్నారంటూ రైతుల ఆవేదన
- అయిన వారికే అధిక మొత్తంలో యూరియా
- అవసరంలేని మందులను అంటగడుతున్న ఎరువుల షాపు యజమానులు
- సొసైటీలకు, రైతు సేవా కేంద్రాలకు రాని యూరియా
- ప్రైవేటు దుకాణాలకు పుష్కలంగా చేరుతున్న యూరియా
- అధికారుల పర్యావేక్షణ శూన్యం... ఇబ్బందుల్లో రైతులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** యూరియా కోసం రైతులు తిరగని ఎరువు దుఖాణం లేదు, తిరగని ఊరులేదు. అయినా రైతులకు యూరియా అందని ద్రాక్షగా మారిందనాల్సిందే. యూరియా కోసం వేకువజామున లేచి దుకాణాల వద్దకు చేరుకొని ఎవరో వస్తారో ఏమో తెస్తారూ అన్న చందంగా యూరియా వస్తాదోమో అనుకొని దుఖాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కాస్త నీళ్లు తాగేందుకు వెళ్తామన్న పక్కకు వెళ్తే యూరియా దొరకదేమో అనే భయంతో ఆకలి దప్పులు మానేసే షాపుల వద్ద తిష్టవేసి కూర్చుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు ఎదురు చూసినా యూరియా దొరకక నిరాశతో వెనుతిరుగుతున్నారు. అదిగో అక్కడుంది, ఇదిగో ఇక్కడుంది అనే మాటలకు వ్యయ ప్రయాసాలతో ఎరువుల దుఖాణాల వద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు. ఆత్మకూరు డివిజన్‌లోనే కాకుండా రెండు జిల్లాల్లో సమీపంలో ఉన్న పట్టణ, గ్రామాలకు వెళ్ళినా యూరియా లభించడం లేదు. యూరియా కోసం రైతుల కష్టాలు అంతా ఇంత కాదు. కనిపించిన వారినంతా అడగడం, తెలిసిన వాళ్ళతో సమాచారం కనుక్కోవడం ఇలా తెలిసినా వాళ్ళనంత యూరికోసం అడుక్కునే దుస్థితితో రైతున్నలు విల విలలాడుతున్నారు. మరికొందరు సమీపంలోని తెలంగాణ రాష్ట్రానికి సైతం యూరియా కోసం వెళ్ళారు. ఎరువుల షాపుల యజమానులు అయిన వారికి బస్తాల కొద్ది యూరియాను అందిస్తు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తం కొనుగోలు చేసిన బడా రైతులు గ్రామంలోనే అధిక మొత్తానికి యూరియాను రైతులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా దొరికినా కొనలాంటే అవసరం లేని మందులు కొంటేనే యూరియా ఇస్తామని, అది కూడా రెండు సంచుల కంటే ఎక్కువ ఇవ్వమని, ఇష్టమైతే కొనుక్కోలేకుండా వెళ్ళిపో అంటూ ఎరువుల దుఖాణదారులు రైతులకు ఖరాకండిగా చెబుతున్నారు. చేసేదిమి లేక తప్పనిపరిస్థితుల్లో రైతులు కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం లేనిపోని మందులు అధిక ధరలకు అంట గట్టడంతో పాటు అధిక ధరలకు విక్రయిస్తు రైతుల జేబులకు చిల్లులు పెడుతున్నారని బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే సొసైటిలు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందించాల్సిన యూరియా అక్కడ కనిపించడం లేదు. ఎప్పుడు అడిగినా యూరియా రాలేదంటూ సొసైటి , రైతు సేవా కేంద్రాల అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఎరువుల దుఖాణాలకు మాత్రం యూరియా వస్తుండడంతో రైతులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు కాసులకు కక్కృతిపడి యూరియా లారీలను బయటే బేరాసారాలకు కుదుర్చుకొని ప్రైవేటు ఎరువు దుఖాణాలకు తరలిస్తున్నారనే విమర్శల రైతుల నుంచి వినిస్తున్నాయి. ఇదంతా జరుగుతున్న మండల స్థాయి అధికారులు మొదలు ఉన్నత స్థాయి అధికారుల వరకు చోద్యం చూస్తున్నారే కాని మాకష్టాలు తీర్చేదెవరూ అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి, మొక్కజొన్న పంటలు నీటమునిగితే వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టశాతాన్ని తగ్గించుకోవాలంటే నీటిని తొలగించి యూరియాను వాడాలని సలహాలు ఇస్తున్నారు కాని, యూరియా దొరకడం లేదనే సమస్యపై స్పందించడం లేదంటూ పలువురు రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. యూరియా కష్టాలతో సతమతమవు తున్న రైతులకు యూరియా దొరికేదెప్పుడు నీట మునిగిన పంటలను కాపాడుకునేదెప్పుడూ అని రైతులు నిరాశ చెందుతు న్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు అవసరమైన యూరియాను అందించాలని రైతులు కోరుతున్నారు. ఏదిఏమైనా ప్రస్తుత పరిస్థిలో యూరియా రైతులకు అందని ద్రాక్షగా మారిందని చెప్పకతప్పదు. యూరియా కొరతపై వ్యవసాయాధికారులను వివరణ కోరేందుకు చరవాణి ద్వారా సంప్రదించేందుకు 'మేజర్‌న్యూస్' ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# శారీరక శ్రమతో.. చక్కటి ఆరోగ్యం



సైక్లింగ్‌లో పాల్గొన్న పోలీసులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రస్తుత జీవన శైలిలో ఎక్కువగా శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక సౌకర్యాలతో జీవనం సాగించడం వల్ల ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని శారీరక శ్రమతోనే చక్కటి ఆరోగ్యం చేకూరుతుందని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని సైకిల్ ర్యాలీ నిర్వహించారు. దయనందిన జీవన శైలిలో కొంత సమయం సైక్లింగ్ అలవాటు చేసుకుని శారీరక ధృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఇది కేవలం శరీరానికి మేలు చేయడమే కాకుండా పర్యావరణానికి మేలు చేస్తుందన్నారు. పోలీసు సిబ్బంది ప్రతి రోజు విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాంటి సమయంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం తప్పనిసరి అని అన్నారు. సైక్లింగ్ అలవాటు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు.

# తలసేమియా, క్యాన్సర్ చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



దాతలకు సర్టిఫికేట్లు అందచేస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** తలసేమియా, క్యాన్సర్ చిన్నారులను కాపాడాలనే సంకల్పంతో నందమూరి అభిమానులు మెగా రక్తదాన శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో టిడిపి నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి, కాజామియా, కర్ణాటకం, శేఖర్ రెడ్డి, హుస్సేన్ సర్కార్, శ్రీపతి, బుజ్జప్ప, కర్నూలు ఎన్‌బికె ఫ్యాన్స్ సేవా సమితి ఉపాధ్యక్షులు మోతిలాల్, మొల్ల మహమ్మద్ షఫీ, సురేష్‌లు పాల్గొని రక్తదాన శిబిరం ప్రారంబించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తలసేమియా, క్యాన్సర్ చిన్నారుల ప్రాణాలను కాపాడేందుకు బ్లడ్ క్యాంపులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదాతలకు ఫ్రూట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో నన్నూరు పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జాకీర్ హుస్సేన్, నాయకులు అయ్యన్న, సుబ్బారెడ్డి, ఎస్‌సి మద్దయ్య, శంషుద్దీన్, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్‌సి ఫలితాల్లో 'ప్రతిభ' ప్రభంజనం

## – కోచింగ్ సెంటర్ అధినేత అరుణాచల్ రెడ్డి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** డిఎస్‌సి ఫలితాల్లో కర్నూలు ప్రతి భ కోచింగ్ సెంటర్ ప్రభంజనం సృష్టించిందని ఆ సంస్థ అధినేత అరుణాచల్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిభ కోచింగ్ సెంటర్ నందు కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు ఇటీవల విడుదలైన మెగా డిఎస్‌సి ఫలితాల్లో దాదాపు 400మందికిపైగా ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ప్రాణతల మిత్రుల సహాయంతో జిల్లాలో 1996లో స్థాపించిన ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో డిఎస్‌సిలో అభ్యర్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. అంతేకాక తమ కోచింగ్ సెంటర్‌లో ఆర్థికంగా వెనుకబాటు ఉన్న ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు ఫీజులో 50శాతం రాయితీ కల్పించినట్లు తెలిపారు. ఈ ఫలితాల్లో బయాలజికల్ సైన్స్‌లో నాగరాజు డిస్టిక్ టాపర్‌గా నిలిచారని, సుమలత 10వ ర్యాంకు సాధించిందని వివరించారు. ఇక్కడికి చాలామంది అభ్యర్థులు రాలేకపోయారని సర్టిఫికేట్ల సర్ధుబాటులో ఉన్నారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారంతా భవిష్యత్తులో పేద విద్యార్థులకు సహాయం చేసి తోడ్పడాలని ఆయన కోరారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. జిల్లాలో మంచి ర్యాంకులు సాధించడంతో పాటు సుమలత అనే అభ్యర్థి ఎస్.ఏ సోషల్, ఎస్ఏ తెలుగు, ఎస్‌జిటి ఉద్యోగాలను ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు.



ప్రభిత చూపిన డిఎస్‌సి అభ్యర్థులతో అరుణాచల్ రెడ్డి

**నాకంటే మా సార్‌కే నాపై ఎక్కువ నమ్మకం : సుమలత**



నాకంటే మా సార్ కే నాపై ఎక్కువ నమ్మకం ఉందని డిఎస్‌సిలో మూడు ఉద్యోగాలు సాధించిన సుమలత పేర్కొన్నారు. తనకు ఒక ఉద్యోగం వస్తుంది చాలు అనుకుంటే కాదు నీకు మూడు ఉద్యోగాల్లో వచ్చే అవకాశం ఉందని నీవు అందులో మంచిది ఉంచుకుంటావని చెప్పేవారని తెలిపారు. ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో క్యూస్షన్ పేపర్ తయారు చేసి విద్యార్థులకు ప్రాక్టీసే ఈ ఉద్యోగులకు కారణమైందన్నారు. నాకే కాక ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులందరికి అరు ణాచల్ రెడ్డి సార్ మంచి ప్రోత్సాహం అందిస్తున్నారని వివరించారు. ఆయనకు మా జన్మంత రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

**ప్రతి కోచింగ్ సెంటర్ వల్లే నాకు బయాలజికల్ ఫస్ట్ ర్యాంక్ : నాగరాజు**



ప్రతిభ కోచింగ్ సెంటర్ వల్లే నాకు బయాలజికల్ సైన్స్‌లో జిల్లా మొదటి ర్యాంకు వచ్చిందని చెప్పవచ్చు. నాకే కాక ప్రతిభ కోచింగ్ సెంటర్ మా కుటుంబానికి వీడదీయరాని బంధం ఉందన్నారు. ప్రతిభ కోచింగ్ సెంటర్ ద్వారా మా కుటుంబంలో గతంలో కూడా ఒకరికి ఉద్యోగం వచ్చిందన్నారు.

# ఎస్‌జిటిలో కోసిగి విద్యార్థినికి 131వ ర్యాంక్



**కోసిగి, మేజర్‌న్యూస్ :** ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి ఎగ్జామ్స్‌లో ఎస్‌జిటి ర్యాంకింగ్‌లో కోసిగి విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. మంత్రాలయం నియోజకవర్గం కోసిగి గ్రామానికి చెందిన ముకుంద సువర్ణ అనే విద్యార్థిని ఇటీవల నిర్వహించిన డిఎస్‌సి పరీక్షలో ప్రతిభ కనబరిచి ఎస్‌జిటిలో జిల్లా పరంగా 131వ ర్యాంక్ సాధించింది. కర్నూలులోని ప్రతిభ కోచింగ్ సెంటర్‌లో ప్రిపరేషన్ అయినట్లు సువర్ణ తెలిపారు. ఎస్‌జిటి ఉద్యోగం కోసం పోటీ పడి చదువుతున్నట్లు చెప్పారు. ఈ పోటీ పరీక్షల్లో 87.066 మార్కులు సువర్ణ సాధించింది. కోసిగి లాంటి వెనుకబడ్డ ప్రాంతంలో తండ్రి కృష్ణమూర్తి వ్యవసాయ కూలీగా ఆడపిల్లని చదువులో ప్రోత్సహించిన నేపథ్యాన్ని అందరు హర్షిస్తున్నారు. ప్రతి పేరెంట్స్ కూడా ఆడపిల్లలు అని తక్కువ చూడరాదని వారికి విద్యపరంగా ప్రోత్సాహం అందించాలని తెలిపారు.

# వ్యక్తిపై దాడి.. – కేసు నమోదు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన నార బోయిన మధు మరియు మల్లికార్జున సంజన్న అను వ్యక్తుల మధ్య స్థలం విషయంలో మనస్పర్థలు వచ్చి గొడవ పడ్డారు ఈ గొడవలో నారబోయిన మధును మల్లికార్జున సంజన్న రాయితో కొట్టి రక్త గాయం చేశాడు. నారబోయిన మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లికార్జున సంజన్నపై కేసు నమోదు చేసినట్లు సి.ఐ రమేష్‌బాబు తెలిపారు.

సూర్య www.suryaa.com
సోమవారం 25 ఆగస్టు 2025

## సొసైటీ ఛైర్మన్ ఆంజనేయులుకు ఘన సన్మానం



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడబూరు గ్రామంలోని స్థానిక వ్యవసాయా సహకార పరపతి సంఘం చైర్మన్ తలారి మీసేవా ఆంజనేయులును ఆదివారం యువసేన యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టిడిపి రైతు విభాగం అధికార ప్రతినిధి నరవరమాకాంత రెడ్డిని కూడా యూత్ సభ్యులు పూలమాలలు వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు. సన్మానం చేసిన వారిలో నాగరాజు. పురుషోత్తం. వీరేశ్. మెహబూబ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలలో పోలీసులు,వ్యవసాయాధికారుల తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** రైతులకు అందించాల్సిన ఎరువులు ప్రక్క దారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ, రూరల్ సీఐలు యుగంధర్, మురళీధర్ రెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఉన్నతాదారిరుల సూచనల మేరకు ఆదివారం పోలీసులు మరియు వ్యవసాయ అధికారులు ఆళ్లగడ్డ మండలంలో ఎరువులకు సంబంధించిన ఎరువుల హెూల్సేల్ దుకాణాలు గోడౌన్లు మరియు ఇతర పరిశ్రమలను తనిఖీ చేశారు. రసాయనిక ఎరువులు మందులు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ బిల్లు బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా షాపుల యజమానులకు పలు సూచనలు చేసి, రైతులకు అందించాల్సిన ఎరువులు ప్రక్కదారి పట్టిస్తే, చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. యూరియాను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలన్నారు. యూరియా రైతులకు అమ్మకుండా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, రూరల్ ఎస్సైలు జయప్ప, వరప్రసాద్ ఉన్నారు.

## టూవీలర్ ఢీకొని వ్యక్తి మృతి




మృతిచెందిన శీలన్న, ఢీకొన్న ద్విచక్ర వాహనం

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని జాతీయ రహదారి 44అబ్బాస్ నగర్ ప్రాంతంలో ఎమ్మిగనూరుకు చెందిన శీలన్న(60)అనే వ్యక్తి మృతిచెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎమ్మిగనూరు నుంచి కర్నూలుకు వచ్చి కర్నూలులో రామచంద్ర నగర్‌లో ఉన్న తన కూతురును చూసేందుకు అబ్బాస్ నగర్ వైపు నుండి రామచంద్రానగర్‌కు రోడ్డు దాటుతుండగా నంద్యాల జిల్లా పోలూరు గ్రామానికి చెందిన అమర్‌నాథ్ పి39జీఎం8399అనే టువీలర్‌పై అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో కిందపడ్డ శీలన్న అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 4వ పట్టణ ఏఎస్ఐ షబ్బీర్ అహ్మద్ క్యూఆర్‌టిలో ఉండి సంఘటన స్థలానికి వెళ్లి ద్విచక్రవాహనదారుడు అమర్‌నాథ్‌ను పట్టుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నాడు. చనిపోయిన శీలన్న మృతదేహాన్ని రోడ్డుపక్కకు తీసి సమాచారాన్ని ట్రాఫిక్ పోలీసులకు తెలియజేశారు. ట్రాఫిక్ పోలీసులు అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు పట్టణంలోని పంపన్న గౌడ్ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డ్ హెడ్ మాస్టార్ మోజెష్, రిటైర్డ్ టీచర్ రహేళమ్మ ఇంట్లో అర్ధరాత్రి చోరీ జరిగిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. కుమారుడు ప్రవీణ్ తెలిపిన వివరాల మేరకు.. మా తల్లిదండ్రులు లండన్‌లో ఉంటున్న మా సోదరి దగ్గర 3 నెలలు క్రితం వెళ్లారని, తాను ఇదే ఇంటిపైన ఉంటున్నానని, అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో దొంగలు చేరబడి ఇంట్లో ఉన్న దాదాపు దాదాపు 2 తులాలు, 10 తులాలు వెండి, బట్టలు, ద్విచక్ర వాహనం దొంగలించినట్లు ప్రవీణ్ తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీందొంగతనం జరిగిన సంఘటన వద్దకు చేరుకుని పరిశీలించారు.

## కారును ఢీకొట్టిన టిప్పర్

**ఎస్వీఆర్ కళాశాల ఛైర్మెన్ వెంకటరామిరెడ్డికి తృటిలో తప్పిన ప్రమాదం**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకటరామిరెడ్డి ఫార్చునర్ కారును ఆదివారం బొగ్గు లైన్ సమీపంలో టిప్పర్ డీ కొట్టింది. ప్రమాద దాటికి ఫార్చునర్ కారు ముందు భాగం దెబ్బతింది.కారు లో ఉన్న వెంకటరామిరెడ్డి కి స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది.

## పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు..

**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి**
**ఎమ్మెల్యే గిత్త జయ సూర్య , మండ్ర శివానందరెడ్డి**



ప్రమాణ స్వీకారం చేస్తున్న రాయపాటి గోవిందు



ఎమ్మెల్యే,టీడీపీ ఇంచార్జీలను సత్కరిస్తున్న వేంపెంట సొసైటీ అధ్యక్షుడు లక్ష్మీకాంతరెడ్డి

**పాములపాడు మేజర్ న్యూస్ :** పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను గుర్తిస్తుందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు.ఆదివారంపాములపాడుమండలకేంద్రంలో ఆంధ్ర ప్రగతి రైతు సహకార సంఘం సొసైటీ చైర్మన్ రాయపాటి గోవిందు, వేంపెంట సహకార సంఘం చైర్మన్ లక్ష్మీకాంతరెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గిత్త జయ సూర్య, నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, హాజరయ్యారు పాములపాడు వేంపెంట గ్రామాలలో సొసైటీ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం అనంతరం డైరెక్టర్లుగా వెంకటస్వామి,సామన్న చేయగా వేంపెంట సొసైటీకి వెంకటేశ్వరరావు మౌలా లిలతో ప్రమాణస్వీకారంచేయించారు. అనంతరం మాండ్రశివానందరెడ్డి గిత్త జయ సూర్యలు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో టిడిపి ప్రభుత్వంతోనే లిఫ్ట్ ఇరిగేషన్లు వచ్చాయని గత ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయలేక పోగా ఉన్న వాటినికూడా చిన్నాభిన్నంచేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోదావరి నీళ్లు తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారని గోదావరి నీళ్లు రాయలసీమకు వస్తే రాయలసీమ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని కూటమి ప్రభుత్వం బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని బీసీలకు 40 శాతం సొసైటీ చైర్మన్లుగా ఎన్నుకోవడం జరిగిందని సూపర్ సిక్స్ పథకాల్లో దీపం పథకం, ద్వారా మూడు సిలిండర్లు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి దారుల ఖాతాలో డబ్బులు జమ చేశామన్నా రు. ఈ నెల ఆగస్టు 15 నుంచి మహిళలకు శ్రీ శక్తి పథకం కింద ఉచిత ప్రయాణం కల్పించామని గుర్తు చేశారు.తెలుగుదేశం పార్టీ హయాంలోనే రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లు హార్వెస్టర్లు పంపిణీ చేశామని మండ్రశివానందరెడ్డి అన్నారు. వాస్తవానికి అన్నిచోట్ల యూరియా కొరత ఉందని దాన్ని కూడా పరిష్కరి స్తామని రైతులు ఎలాంటి ఆందోళనచెందాల్సిన అవసరం లేదన్నారు. జగన్మోహన్ రెడ్డి తల్లికి అన్నం పెట్టలేనోడు రాష్ట్రానికి ఏం చూసుకుంటాడని ఎద్దేవా చేశారు జడ్పిటిసి సర్పంచ్ ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కార్యకర్తలు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం వికలాంగుల పెన్షన్లు అర్హులు కాకున్నా లబ్ధి పొందు తున్నారని అలాంటి వారిని కట్టడి చేయడానికి ఈ పెన్షన్ రివెరిఫికేషన్ ప్రారంభించారని అలాంటివారు ఎవరైనా ఉంటే స్థానిక నాయకులను కలవాలని ఆయన సూచిం చారు.నూతనంగా ఎన్నికైన చైర్మన్లు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ పదవికి ఎంపిక చేసిన మండ్ర శివానంద రెడ్డి, జయ సూర్య లకు ధన్యవాదాలు తెలిపారు సహకార సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌మండ్రసురేంద్రనాథ్ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, పలుచాని మహేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు రూరల్‌సీఐసురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై సురేష్ బాబు, మాజీ కన్వీనర్ హరినాథ్‌రెడ్డిబండ్లమూరి వెంకటేశ్వరరావు, తిమ్మారెడ్డి, మధుసూదన్ రావు, ఉపేంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి,సర్పంచ్ మేకలభాగ్యమ్మ లింగాల సర్పంచ్ మల్లేశ్వర్ రెడ్డి, వేంపెంట సర్పంచ్ మాణిక్యమ్మ, తుమ్మలూరుసర్పంచ్ వరప్రసాద్,ఆదిరెడ్డి, కరీం భాష, హుస్సేన్ భాష,మోహన్ గౌడ్, గంట మధు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ మజ్దూర్ యూనియన్ సర్వసభ్య సమావేశం

**బనగానపల్లెరూరల్,న్యూస్ః** బనగానపల్లె పట్టణంలో ఆదివారం నాడు నేషనల్ మజ్దూర్ యూనియన్ యూనిటి అశోషియేషన్ సర్వసభ్య సమావేశం స్థానిక మర్చంట్ భవనం నందు నిర్వహించడం జరిగింది. సమావేశానికి జిల్లా అద్యక్షులు ఎం. సుదర్శనం అద్యక్షత వహించారు. ముఖ్య అతిధులుగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దిలేటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై. భద్రావతి, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, జిల్లా ఛైర్మెన్ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె. శివరాం, జిల్లా ముఖ్య ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డీలు హాజరయ్యారు. ఈ సమావేశం నందు బనగానపల్లె డిపో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించడం జరిగింది. డిపో చీఫ్ అద్వజర్‌గా మద్దయ్య, డిపో అద్యక్షుడుగా జంబులయ్య, డిపో కార్యదర్శిగా శ్రీనివాసులు, గ్యారేజి కార్యదర్శి దేవేందర్ రెడ్డి, గ్యారేజి అద్యక్షులుగా గఫూర్ మరియు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## శిథిలావస్థలో మున్సిపల్ కాంప్లెక్స్

**– పెచ్చులూడుతున్న మున్సిపల్ దుకాణాలు**
**– పట్టించుకోని అధికారులు**

**ఆదోని, మేజర్‌న్యూస్ :** ఆదోనిని ఒకప్పుడు సెకండ్ బొంబాయి అని పిలిచే వారు. ప్రస్తుతం మున్సిపాలిటీకీ ఆదాయం లేక మున్సిపల్ దుకాణాలుపెచ్చులూడిప్రాణాలను అరచేతిలోపెట్టుకొని లీజుదారులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు నెల నెల బాడుగలను వసూలు చేసుకోవడం, మూడేళ్లకొకసారి బాడుగలను పెంచడం తప్ప దుకాణాలను పట్టించుకోవడం లేదని దుకాణలీజు దారులు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదిలోనే మున్సిపల్ కాంప్లెక్స్ మొత్తం పెచ్చులూడి పోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. గత కొన్ని రోజుల క్రితం కుండపోత వర్షం కురవడం వలన బీసీ సంఘం నాయకుడు బోల నీలకంఠప్ప దుకాణం పైపెచ్చులూడి ఫర్నీఛర్, ఆరు కుర్చీలు ధ్వంసం కావడం జరిగింది. ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేసిన ఫలితం మాత్రం దక్కలేదన్నారు. పట్టణంలోని మున్సిపల్ మెయిన్ రోడ్డుతోపాటు రైల్వేస్టేషన్ రోడ్డులో 1978లో అప్పటి ఎమ్మెల్యే హల్వి సత్యనారాయణరావు దుకాణాలను ప్రారంభించారు. మున్సిపల్ మొదటి అంతస్థులో కూడ దుకాణానునిర్మించారు.అయితే పర్యవేక్షణ కొరవడిన కారణంగా మొదటి అంతస్తులోని దుకాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మున్సిపల్ కాంప్లెక్స్ పెచ్చులూడి పోతున్న దుకాణాలను బయట, లోపల గోడలు కూలిపోయేలా ఉన్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం దుకాణాలను నడుపుకోవడానికి టెండర్లు వేయడం జరిగింది. టెండర్ల ప్రక్రియ కూడ నామమాత్రంగా కొనసాగుతుందనే చర్చ ఉంది. మున్సిపల్ దుకాణాలు కూలిపోయి ప్రమాద స్థితిలో ఉన్న కూటమి నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సమస్యలపై స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పెచ్చులూడిపోతున్న దుకాణాలకు మరమ్మత్తులు చేయాలని దుకాణాల లీజు దారులు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమీషనర్‌ను వివరణ కోరగా, మున్సిపల్ దుకాణాలు మొదటి అంతస్తులో చాలా వరకు ఖాళీగా ఉన్నాయని, రెవిన్యూ, ఆర్అండ్‌బి అధికారులను సంప్రదించి భద్రతపై చర్చించి దుకాణాలకు మర్మత్తులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## శ్రీ గణేష్ ఉత్సవాల సందర్భంగా ఇసుకలో నడక పోటీలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ పట్టణంలోని శిల్పా నేచర్ హెూమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పార్కులో ఇసుకలో రన్నింగ్ పోటీలను నిర్వహించారు. రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ సి . రామగోపాల్ రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా కాలనీవాసులకు ఆటవిడుపుగా ఈ పోటీలను ఈ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మొదటి, రెండవ బహుమతి విజేతలుగా నిలిచిన రఘు, వీరేంద్ర రెడ్డి, శివ ప్రసాద్ రెడ్డి, మాధురి, కావ్యశ్రీ, నాగమ్మ ప్రమీలమ్మ తదితరులకు బహుమతులను రోటరీ ఆరోగ్య వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రాంగోపాల్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా కళాశాల డైరెక్టర్ హేమలత రెడ్డి, నర్సింహారెడ్డి, దొమ్మరి కాలనీ వెల్ఫేర్ అసిస్టెంట్ వీరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**శిబిరం ప్రారంభించిన ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ నెరవాటి పాలి క్లినిక్ లో ప్రతి గురువారం ఉచిత ఓ.పి.డి సేవలు:డాక్టర్ నెరవాటి వినోద్**





**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :**నంద్యాల గాంధీ చౌక్ సమీపంలో, పెద్ద పోస్ట్ఆఫీస్ఎదురుగా ఉన్న నెరవాటి పాలి క్లినిక్, నంద్యాల లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో, పాలీ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ నెరవాటి వినోద్కుమార్ డాక్టర్అరుణకుమారి పర్యవేక్షణలో ఆదివారం ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేశుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవకార్యక్రమంలో ముఖ్యఅతిథిగాపాల్గొన్న ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నెరవాటి పాలీ క్లినిక్ లోఉచితవైద్యశిబిరం నిర్వహించడంఅభినందనీయమన్నారు. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. నంద్యాల వైద్యులు సేవా దృక్పథంతో వివిధ సందర్భాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.డాక్టర్ నెరవాటి వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి గురువారం నెరవాటి పాలి క్లినిక్ లో ఓపి సేవలు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. ఉచిత వైద్య శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సుమన్, స్త్రీవ్యాధి, ప్రసూతినిపుణురాలు డాక్టర్ ఫాతిమా, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ దివ్య తేజ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నటరాజ్ ,దంత వైద్యురాలు డాక్టర్ పద్మ ప్రియాంక దాదాపు 300 మంది రోగులను పరీక్షించి, అవసరమైన పరీక్షలు నిర్వహించి, 50 వేల రూపాయల విలువచేసే మందులను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 150 మందికి ఎముకల సాంద్రత పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ తరపున అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి ,కోశాధికారి అమిదేల జనార్ధన్ శిబిరంలో ఉచిత సేవలు అందించిన వైద్యులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు నెరవాటి సత్యనారాయణ, నెరవాటి పాలి క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ అరుణకుమా రి, రమేష్, హరిబాబు, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి ,కోశాధికారి అమిదేల జనార్ధన్ , వైద్య శిబిరంలో సేవలందించిన వైద్యులు సుమన్, ఫాతిమా, నటరాజ్ ,దివ్య తేజ ,పద్మా ప్రియాంక పాల్గొన్నారు.

## వినాయకచవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



గ్రామ పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రశాంతంగా బుధవారం వినాయక విగ్రహప్రతిష్ట, శుక్రవారం నిమజ్జన కార్యక్రమాలు జరుపుకోవాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ కోరారు. ఆదివారం ఆయన మండలంలోని పలుగ్రామాల పెద్దలతో సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడితే వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగనుభక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. వినాయక మండపాలు ఏర్పాటు విషయంలో ప్రభుత్వ నిబంధనలను పాటించాలన్నారు. వినాయక బృందాల సభ్యులు విద్యుత్ శాఖ, పంచాయతీ, అగ్నిమాపక శాఖ అనుమతులు మొదట తీసుకొని అనంతరం పోలీసుల అనుమతి తీసుకున్న తర వాత వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాలను రోడ్డులో ఏర్పాటు చేసుకోరాదన్నారు. గోనెగండ్ల తదితర ప్రాంతాల ప్రజలు శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టులో సాయంత్రం లోపు నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఎలాంటి గొడవలకు తావు ఉండరాదని మతసామరస్యాన్ని పాటించాలని నిమజ్జనంకు చిన్నపిల్లను తీసుకువెళ్లారాదని కోరారు. ఈ కార్యక్రమంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి, పలు గ్రామాల పెద్దలుపాల్గొన్నారు.

## ఎమ్మిగనూరు నుంచి కౌతాళంకు ఆర్టీసీ బస్సును కేటాయించాలి

**దర్గా పీఠాధిపతి సయ్యద్ మున్నా సాహెబ్**



**ఎమ్మిగనూరు,మేజర్న్యూస్:**శ్రీసయ్యద్ఖాదర్లింగా స్వాముల వారి భక్తులకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండాఎమ్మిగనూరు నుండికౌతళాంకు ప్రత్యేక బస్సును ఆర్టీసీ అధికారులు కేటాయించాలని దర్గా పిఠాధిపతి సయ్యద్ మున్నా సాహెబ్ కోరారు. ఆదివారం అయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు చుట్టుపక్కల శ్రీసయ్యద్ ఖాదర్లింగా స్వాములవారి భక్తులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, వారు దర్గాకు చేరుకునేందుకు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కౌతళాంకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని కొన్ని నెలల క్రితం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ. జయ నాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ఆయన స్పందిస్తూ ఆర్టీసీ డిఎంకు బస్సును కేటాయించాలని ఆదేశాలు జారీచేశారనితెలిపారు. ఆర్టీసీ అధికారులు కేవలం వారం రోజుల పాటు మాత్రమే బస్సును కేటాయించి ఆ తర్వాత నిలుపుదల చేశారన్నారు. ఎమ్మిగనూరు నుండి కౌతళాంకు బస్సు కోవిడ్ ముందు యధావిధంగా ఉండేదని గుర్తు చేశారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని ఎమ్మిగనూరు ప్రాంతం నుండి వయా ఆదోని లేదా ఉరుకుంద మీదుగా కౌతాళంకు బస్సు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ బస్సు కేటాయింపు విషయాన్ని ఎమ్మిగనూరు ఆర్టీసీ డి ఎం కు ఎన్నోసార్లు విన్నవించినట్లు తెలిపారు.

## ముంపుకు గురైన పంటలను పరిశీలించిన సిపిఎం నాయకులు



**పెద్దకడుబూరు, మేజర్ న్యూస్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలవల్ల దెబ్బ తిన్న పంటలను పెద్దకడబూరుమండలపరిధిలోని హులికన్వి .చిన్నతుంభళం గ్రామాలలో భారీ వర్షాలకు ముంపుకు గురైన పత్తి మిరప ఉల్లి పంటలను ఆదివారం సిపిఎం మండల కార్యదర్శి ఈడిగ తిక్కన్న అధ్వర్యంలో సిపిఎం నాయకులు రైతుసంఘం నాయకులు పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హులికన్వి. చిన్నతుంభళం గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి పంటలో వర్షపు నీరు నిల్వ ఉన్నందున సుమారుగా ఒక ఎకరాకు రూ 30.వేలు వరకు పంటనష్టం జరిగిందని వారు అంచనా వేశామని వారు తెలిపారు. అలాగే వర్షం వల్ల వేలాది ఎకరాలు పంట నష్టం వాటిల్లిందని తెలిపారు. అయిన రైతులకు ఇంత పంట నష్టం జరిగిన కనీసం మండల వ్యవసాయ శాఖ అధికారి,సిబ్బంది కనీసం పంటలను కూడా పరిశీలించ లేక పోయారని వారన్నారు. ఇప్పటికైన జిల్లా వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ మండల నాయకు లు దేవదాసు. రైతులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## తమ దైనందిన జీవనశైలిలో కొంత సమయం సైక్లింగ్ అలవాటు చేసుకోవాలి



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న సీఐలు, ఎస్సైలు

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్:** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అదేశాలమేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా "సండే ఆన్సైకిల్"కార్యక్రమాన్ని ఆళ్లగడ్డలో నిర్వహించారు. రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రూరల్ సర్కిల్ కార్యాలయం నుంచి టీబి రోడ్డు, అక్కడి నుంచి సర్కిల్ ఆఫీస్ కార్యాలయానికి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకొనే విధంగా చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపడం ప్రస్తుత కాలంలో అత్యంత ముఖ్యమని అందులో భాగంగా తమ దైనందిన జీవనశైలి లో కొంత సమయం సైక్లింగ్ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సైక్లింగ్ సాధారణ ఆరోగ్యపరిరక్షణ కోసం ఒక సరళమైన, సురక్షితమైన మార్గమని, ఇది కేవలం శరీరానికి మేలు చేయడం మాత్రమే కాక, పర్యావరణానికి కూడా మేలు చేస్తుందన్నారు. పోలీస్ సిబ్బంది ప్రతి రోజు విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, అలాంటి సమయంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం తప్పనిసరని కావున సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వరప్రసాద్, రామిరెడ్డి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సైకిలింగ్ తో శారీరక ధృడత్వం

**-ఫిట్ ఇండియా సైకిలింగ్ ఆన్ సండే కార్యక్రమంలో ఎస్ఐ పరమేష్ నాయక్**




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ పరమేష్ నాయక్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** నేటి ఆధునిక యుగంలో మనిషి జీవనశైలి మారిందని ఉరుకుల పరుగుల జీవితంలో ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టడం లేదని అందుకే శరీరక రోగాలు,మానశికవత్తిడి తో మనిషి ఆయుష్షును తగ్గించుకుంటున్నాడని ఇందుకు జీవన విధానంలో ప్రతి రోజు కొంత సమయం వ్యాయామం తప్పనిసరిగా చేయాలనీ ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు మండలంలో ఆదివారం సండే ఆన్ సైకిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్ఐ పరమేష్ నాయక్ తన సిబ్బందితో కలసి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సైకిలింగ్ చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎలక్ట్రానిక్,మోటార్ వస్తువులతో ఎక్కువ సమయం గడుపుతున్నాడని దీనివల్ల మనిషి పర్యావరణ కాలుష్యం జీవిస్తున్నాడన్నారు. మనిషి ప్రతి రోజు వ్యాయామం చేస్తూ శరీరక ఆరోగ్యం పొందుతూ సైకిలింగ్ చేస్తూ శారీరక దృఢత్వం సాధించవచ్చాన్నారు. అందుకు కొంత సమయం వ్యాయామం కోసం సమయం కేటాయించి మనిషి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్ ఐ పరమేష్ నాయక్ సూచించారు.

## విజయవంతంగా 59వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా ఉచిత వైద్య శిబిరం



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్:** పేదల కోసమే కార్పొరేట్ స్థాయి లో ప్రతి నెల చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గురురాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి అన్నారు. పెద్దిరెడ్డితిమ్మారెడ్డిచారిటబుల్ సొసైటిఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 59వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డిప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తనతల్లిదండ్రుల నుండితనకు వచ్చిన 10 ఎకరాల పొలాన్ని పేదల కోసమే కేటాయించి కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన తండ్రి పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి లక్ష్యమని చెప్పారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ, తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ, కోవెలకుంట్ల , బనగానపల్లె, జమ్మలమడుగు పరిసర ప్రాంత ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే తమకు శ్రీరామరక్ష అన్నారు. 59వ మెగా వైద్య శిబిరంలో 1200 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ షేక్షావలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు, మోకాళ్ళ నొప్పు లు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందిం చిన వ్యాదులు, చెవి , ముక్కు , గొంతుకు సంబందించిన జబ్బుల కు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల, బనగానపల్లె, జమ్మలమడుగు పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.

## కారు - ద్విచక్ర వాహనం ఢీ .. ఇద్దరి పరిస్థితి విషమం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి వద్ద కారు –ద్విచక్ర వాహనం ఢీకొన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తెలిసిన వివరాలు ఇలాఉన్నాయి. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మంత్రాలయంకు చెందిన మహబూ, రాజేష్లకు తీవ్రగాయాలైయ్యాయి. వీరిద్దరి పరిస్థితి విషమంఉండడంతోకర్నూలు ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకునిదర్యాప్తు చేస్తున్నారు.







సూర్య
www.suryaa.com
సోమవారం | 25 ఆగస్టు 2025

# వైభవంగా ముగిసిన వీరభద్రేశ్వరస్వామి శ్రావణమాస వేడుకలు

**– హాజరైన భక్తజనం**



**హొళగుంద,మేజర్‌న్యూస్ :** మండలకేంద్రమైన హొళగుందలో శ్రీ వీరభద్రేశ్వరస్వామి శ్రావణమాస వేడుకలు ఆదివారం పాడ్యామి రోజున వైభవంగా ముగిశాయి.శ్రావణమాసం ప్రారంభం అయిన రోజు నుండి నెల రోజులపాటు ప్రతి దినం భక్తులు స్వామి వారికి రుద్రాభిషేక పూజలను నిర్వహించారు.స్వామి వారికి విశేషంగా పూజలతో పాటు అలంకరణ మహామంగళారతి పూజలను జరిపించారు. ఆదివారం చివరి రోజు కావడంతో స్థానిక బస్టాండ్ ముందున్న పెద్దబావి వద్ద గంగిపూజను చేసి మహిళల కళసలతో వీరకాశయ్యతో దేవుని పేరిట ఖడ్గం చెప్పడం భక్తులకు శస్త్రాలను గుచ్చడం కార్యక్రమాలను చేస్తూ దేవాలయం వరకు భక్తులతో డప్పుల ద్వార ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా పూజలను చేసి పూల ఆరటి పండులతో విశేషంగా అలంకరించారు,మహామంగళారతి పూజను చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరైయ్యారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసా దంతో పాటు కమిటి సభ్యులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. దేవాల యంలో భక్తుల నెలకొంది. కార్యక్రమంలా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరూ వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



సైకిలింగ్‌లో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ, పోలీసులు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రతిఒక్కరు వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా అన్నారు. ఆదివారం నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైకిలింగ్‌ను అలవాటుగా చేసుకోవాలన్నారు. పోలీసులు, ప్రజలు సైకిలింగ్‌లో పాల్గొనే విధంగా చేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ భాస్కర్ రావు, కర్నూలు టుటౌన్ సిఐ నాగరాజారావు, ఆర్‌ఐలు నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ ఎస్ఐలు, సిబ్బంది, యువ విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీలో మంత్రి టీజీ భరత్**



**కర్నూలు, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని ఆయన కార్యాలయంలో 13 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. షేక్ అబ్దుల్ ఆర్మాన్ కు రూ. 19,944, మరియమ్మకు రూ.65వేలు, షేక్ షేకూన్ కు రూ.61,572, లక్ష్మీ నారాయణకు రూ.1,25,343, మీసాల మాధవస్వామికి రూ.85వేలు, రెహాన సుల్తాన్ కు రూ.25,574, నజీర్ అహ్మద్ కు రూ.55వేలు, నీలం మాధవరాయుడుకు రూ. 1,19,708, రాజకుమార్ రెడ్డికి రూ. 1,14,574, షేక్ ఖాజాబీకు రూ. 1,04,196, సుబ్బరామయ్యకు రూ.71,922, గౌండ అబ్దుల్ వహీద్‌కు రూ.43,565, ఉప్పు రామ పద్మజకు రూ.3,35,520ల చెక్కులు మంత్రి టి.జి భరత్ అందజేశారు. మొత్తం రూ.12,26,918ల విలువ చేసే చెక్కులు అందజేశారు. ఆపద సమయంలో కర్నూలు నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు అందుకున్న వారు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి టీజీ భరత్ ల మేలు మరిచిపోలేమని సంతోషం వ్యక్తం చేశారు.

# ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవు – ఏఎస్పీ మందా జావళి



ఎరువులను పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఎరువులను అక్రమంగా నిల్వ చేస్తే చర్యలు తప్పవని నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాలలో ఆదివారం ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఏఎస్పీ మందా జావళి ఆధ్వర్యంలో రెండు బృందాలుగా మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సుదర్శన్ ట్రేడర్స్, రేఖ గోడౌన్స్, సమరసింహారెడ్డి గోడౌన్స్, రామకృష్ణా రెడ్డి గోడౌన్స్‌లలో యూరియా నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఈ ఎరువులను అక్రమంగా తరలించినా, నిల్వ చేసినా కేసులు నమోదు చేస్తామని ఏఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలూకా సిఐ ఈశ్వరయ్య, టూ టౌన్ సిఐ కంబగిరి రాముడు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ ధ్యేయం



రైతు పోలంలో డ్రోన్ స్ప్రేయర్ ను ప్రారంభిస్తున్నా దృశ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** రైతు శ్రేయసే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల పరధిలోని ఎండిహళ్లి గ్రామ సర్పంచ్ సుధాకర్ అన్నారు .ప్రభుత్వం సబ్సిడి కింద గ్రామంలో శ్రీ క్రాంతివీర సంగోళి రాయన్న గ్రూఫ్‌కు అందించిన డ్రోన్ స్ప్రేయర్‌ను గ్రామ సర్పంచ్ అధ్యక్షతన,( గూఫ్ కన్వీనర్ కురువ నాగరాజు ఆధ్వర్యంలో కురువ వెంకటరామప్ప, కురువ హనుమంతప్ప రైతుల పోలంలో ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వం అధునిక యంత్రాల అందిస్తు రైతన్న అభివృద్ధికి పాటు పడుతుందని వారు చెప్పారు.డ్రోన్ స్ప్రేయర్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పత్తి,మొక్కజోన్న, వరి,సద్దులు,జోన్న,మిరప పోలాలకు స్ప్రేయర్ ఉపయోగ పడుతుం దన్నారు.కార్యక్రమంలో చంద్ర, దసప్ప,గోవిందరెడ్డి, లింగన్న, శరణ,కాంత,రైతులు పాల్గొన్నారు.

# నీతి గృహలో నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని సంజీవయ్య నివాస స్థలం నీతి గృహలో దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవ అధ్యక్షులు నక్కలమిట్ట శ్రీనివాసులు ఆద్వర్యంలో ఆదివారం నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. నిస్వార్థంగా ఈ దేశానికి సేవలు అందించిన సంజీవయ్య పేరును కర్నూలు జిల్లాకు పెట్టాల్సిందేనని ఏపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోనె నాగరాజు అన్నారు. దశాబ్దాల డిమాండ్‌ను ఈసారి నెరవేరాల్సిందేనని మాల గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి డా.పి ఓబులేష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు పరమేశ్వరయ్య, కురువ సంఘం నాయకులు అయ్యన్న, దామోదరం సంజీవయ్య ట్రస్టు సభ్యులు రంగస్వామి, దామోదరం సంజీవయ్య జిల్లా సాధన సమితి అధ్యక్షులు త్యాగరాజ్, కన్వినర్ కృష్ణయ్య, నాయకులు నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు పోతుల శేఖర్, అయ్యస్వామి, పాండు, సురేష్, తులసీదాస్, రామ్మూర్తి, ప్రేమ్ కుమార్, గోవర్ధన్, రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**– డిఎస్పీ బాబు రాజేంద్రప్రసాద్**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో ఎవరైనా నేరాలకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ బాబు ప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సిఐ పి శేషయ్య, స్పెషల్ పార్టీ పోలీసులు, నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది కలిసి బుధవారం పేటలోని ఎస్‌సి కాలనీల్లో హంద్రీ పరివాహక ప్రాంతంలో నివాసముంటున్న రౌడీషీటర్ల ఇళ్లలో, అనుమానితుల ఇళ్లలో, అక్రమ సారా విక్రేతల ఇళ్లలో కార్డెన్ సెర్చ్ నిమిత్తం 10టీంలుగా ఏర్పడి సోదాలు నిర్వహి ంచారు. ఈ కార్యక్రమం డిఎస్పీ బాబు ప్రసాద్ సారథ్యంలో జరిగింది. సదరు ఇళ్లల్లో ఎలాంటి నెంబర్‌ప్లేట్లు లేని 10టువీలర్లను 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. అనంతరం మారెమ్మ దేవాలయం వద్ద రౌడీషీటర్లు, అనుమానితులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎవరైనా కొత్తవారు ఏరియాలోకి వస్తే వారి గురించి సమాచారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సిఐ పార్థసారథి, టుటౌన్ సిఐ నాగరాజారావు, 4వ పట్టణ సిఐ విక్రమసింహా, 10మంది ఎస్ఐలు, 40మంది పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి బి.సి



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** ఆదివారంనాడు కపడ పట్టణంలోని మాధవి కన్వెక్షన్ నందు కడప జిల్లా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి కుమార్తె రిషిప్‌షెన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను రాష్ట్ర రోడ్లు భవనాలు మౌళిక సదుపా యాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి ఆశీర్వదించారు.

# ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

**– తృటిలో తప్పిన పెను ప్రమాదం**





**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** ట్రాక్టర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న సంఘటన శనివారం అర్ధరాత్రి కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చిత్తూరు జాతీయ రహదారి 44పై హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళుతుండగా మండలంలోని నన్నూరు గ్రామ సమీపంలో ముందుగా వెళుతున్న ట్రాక్టర్‌ను మోక్ష ట్రావెల్స్ బస్సు ఢీకొనగా బస్సులో ఉన్నటువంటి వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొని డివైడర్‌కు బస్సు ఢీకొట్టింది. పొరపాటున పక్కన రోడ్డుకు వెళ్లి ఉంటే ప్రమాదం తీవ్రస్థాయిలో ఉండేది. ఎటువంటి ప్రమాదం జరుగకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా టోల్ అంబులెన్స్ 1033, 108లో ప్రథమ చికిత్స చేయిస్తూ ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా సేఫ్టీ కోన్స్ ఉంచినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఈ సంఘటనపై ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.